క్లుప్తంగా

మొక్కలు నాటిన ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్



మాచర్ల: ఏపీఎస్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అప్పలరాజు, నెల్లూరు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.నాగేంద్రప్రసాద్, పల్నాడు డీపీటీఓ అజిత కుమారి మాచర్ల డిపోను సందర్శించారు. గ్యారేజ్‌లో మొక్కలు నాటారు. గేటు మీటింగ్ నిర్వహించి స్త్రీ శక్తి స్కీం ప్రాముఖ్యత వివరించారు. అలాగే సిబ్బంది నుంచి సలహాలు, వారి సమస్యలగురించి తెలుసుకున్నారు. ప్రభుత్వం స్కీమ్‌లు విజయవంతం చేసేలా కృషి చేయాలని సూచించారు. ఆర్టీసీ డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి పాల్గొన్నారు.

నిమజ్జనానికి తరలివెళ్లిన గణనాథులు



మాచర్ల: పట్టణంలో 11 రోజులపాటు వినాయక చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 50 గ్రామాల్లో ప్రత్యేక వేదికలు ఏర్పాటు చేసి గణనాథుని విగ్రహాలు ఏర్పాటు చేశారు. శనివారం నిమజ్జనానికి ఒకేసారి గణనాథులను తరలించడంతో పట్టణమంతా భక్తి భావం నెలకొంది. భక్తులు ప్రసాద వితరణ చేపట్టారు.

వైరల్ జ్వరాలపై ప్రజలను అప్రమత్తం చేయండి

డీఎంహెచ్‌ఓ జి.రవి



పిడుగురాళ్ల: వైరల్ జ్వరాలపై ప్రజలను అప్రమత్తం చేయాలని డీఎంహెచ్‌ఓ జి.రవి అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. అలాగే ఇళ్ల మధ్యలో నీళ్లు నిల్వ లేకుండా చూసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. దోమలు వ్యాప్తి చెందకుండా క్రిమిసంహారక మందులను పిచికారి చేయించాలని చెప్పారు. దోమతెరలు వాడే విధంగా చర్యలు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మలేరియా జ్వరాలు, డెంగీ జ్వరాలు ఏమైనా కేసులు నమోదు అయితే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్, వైద్యులు ప్రభావతి, రమాదేవి పాల్గొన్నారు.

బెస్ట్ టీచర్ అవార్డు అందుకున్న లక్ష్మీదేవి



దుర్గి: మండల కేంద్రమైన దుర్గిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కామర్స్ అధ్యాపకురాలిగా పనిచేస్తున్న పగడాల లక్ష్మీదేవి, రాష్ట్ర ఉత్తమ అధ్యాపకురాలిగా ఎంపికయ్యారు. విజయవాడలోని ఎ కన్వెన్షన్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నుంచి శనివారం అవార్డు అందుకున్నారు. అవార్డు పొందిన లక్ష్మీదేవిని ప్రిన్సిపాల్ కె.వేణు, సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

రూ.3.60 లక్షలు పలికిన గణనాథుడి లడ్డూ



రొంపిచర్ల: మండలంలోని ఆరేపల్లి గ్రామంలో వినాయకుని పందిట్లో పూజలు అందుకున్న 11 కేజీల లడ్డూ ప్రసాదాన్ని ఆ గ్రామానికి చెందిన మోతుకూరి శ్రీనివాసరావు రూ.3.60 లక్షలకు శనివారం నిర్వహించిన వేలంలో దక్కించుకున్నారు. అలాగే వి.రెడ్డిపాలెం గ్రామంలోని వినాయకుని ఆలయం వద్ద ఏర్పాటు చేసిన గణేష్ పందిట్లోని లడ్డూ ప్రసాదాన్ని గంగారపు కొండారెడ్డి రూ.24 వేల రూపాయలకు వేలంలో పాడుకున్నారు. ఈ విగ్రహాలను మేళతాళాలతో జైగణేష నామస్మరణతో అద్దంకి, గుంటూరు బ్రాంచ్ కెనాల్‌కు తరలించి నిమజ్జనం చేశారు.

వార్డు సచివాలయ ఉద్యోగుల నిరసన

మాచర్ల: రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మున్సిపాలిటీ వార్డు సచివాలయ ఉద్యోగులు శనివారం నిరసన తెలిపారు. పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో వద్ద 16 సచివాలయ పరిధిలోని ఉద్యోగులు నల్లబ్యాడ్జిలు ధరించి నిరసనలో పాల్గొన్నారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తమ ఉద్యోగాలకు జాబ్ చార్ట్ ప్రకటించాలని, సర్వే, క్లస్టర్ మార్పింగ్ నుంచి తప్పించాలని, వాట్సాప్ విధుల నుంచి తప్పించాలని కోరారు. ప్రతి ఉద్యోగిని ఇంటింటికి తిప్పడం మానుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం 1.25 లక్షల మంది గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని కోరారు. దీనిపై స్పందించిన కమిషనర్ వేణుబాబు మీ సమస్యలను ప్రభుత్వ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యు.బాలశౌరి, ఎం.డి.రఫీ, టి.మహేష్, వై.నాగేశ్వరరావు, పి.వెంకటేశ్వర్లు, రఘునాయక్, చంద్రబోస్, పవన్‌కుమార్, సెల్వమణి, రాజేంద్రనాయక్, లీలాపుష్ప, ఎం.నిర్మల, కె.సంధ్య, చిన్నకత్తి నాగమణి, ఉషారాణి, కె.శ్రీహర్ష పాల్గొన్నారు.



కమిషనర్ వేణుబాబుకు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

సచివాలయ ఉద్యోగులకు పనిభారం తగ్గించాలని నిరసన

పిడుగురాళ్ల: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు పనిభారం తగ్గించాలని కోరుతూ శనివారం నల్లబ్యాడ్జిలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ... గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు వలంటీర్ల విధుల మినహాయింపు తప్పనిసరిగా ఇవ్వాలని కోరారు. అన్ని రకాల వలంటీర్ విధులను బలవంతంగా మాపై మోపడం మాకు తీవ్ర ఆవేదన, ఒత్తిడి కలిగిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంటింటికి తిరిగి వలంటీర్ల సర్వే చేయాలని బలవంతపు ఆదేశాలు ఇవ్వడం ఉద్యోగుల గౌరవాన్ని దెబ్బతీస్తోందని, ఈ పరిస్థితుల వలన ఉద్యోగుల ఆత్మగౌరవం దెబ్బతింటోందని వారు తెలిపారు. మన మిత్ర(వాటప్ గవర్నెస్) ఇంటింటికి తిరిగి వెళ్లడం కాకుండా, మైక్ ద్వారా, ప్రకటనలు ద్వారా ప్రజలకు అవగాహన కల్పించే విధానాన్ని తీసుకురావాలని వారు తెలియజేశారు. పలు రకాల డిమాండ్లతో మున్సిపల్ మేనేజర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు.



పిడుగురాళ్లలో నల్ల బ్యాడ్జిలతో నిరసన తెలుపుతున్న వార్డు సచివాలయ ఉద్యోగులు

రైతుకు పాడి- పంట రెండు కళ్లు

వినుకొండ సంగం డెయిరీ మేనేజరు జానకిరామయ్య

శావల్యాపురం: రైతుకు పాడి-పంట రెండు కళ్ళు లాంటివని వినుకొండ సంగం డెయిరీ మేనేజరు మక్కెన జానికిరామయ్య అన్నారు. శనివారం మండలంలోని చినకంచర్ల గ్రామంలో ఉన్న రెండు సంగం పాల కేంద్రాల సెంటర్ల నందు పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజరు జానకి రామయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు పాడి పరిశ్రమ అభివృద్ధికి సంగం డెయిరీ నిరంతరం అండగా ఉంటూ చేయూత నిస్తుందన్నారు. సంగం డెయిరీ అమలు చేస్తున్న పథకాలు రైతులు సద్వినియోగం చేసుకోని ఆర్థిక ప్రగతి సాధించాలన్నారు. పాడి గేదెలకు బీమా చేయించాలన్నారు. అనంతరం రెండు సెంటర్లలో 150 మంది పాల ఉత్పత్తిదారులకు రూ.5 లక్షల 50 వేలు నగదును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంగం డెయిరీ డైరెక్టరు గడుపూడి ఆంజనేయులు సూపర్‌వైజరు కిరణ్, వెంకటేశ్వర్లు, సొసైటీ డైరెక్టరు గోనుగుంట్ల నాగరాజు, సర్పంచ్ పురేటి నాగేశ్వరరావు, సెంటరు ప్రతినిధులు రాయ వెంకటేశ్వర్లు, దావులూరి యల్లమంద, రైతులు పురేటి వెంకటరావు, మాజీ సర్పంచ్ వడ్లమూడి కోటయ్య రైతులు పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న జానకిరామయ్య

తాగునీటి సమస్య పరిష్కరించడమే లక్ష్యం...

రెంటచింతల: మాచర్ల నియోజక వర్గంలోని గ్రామాలలో తాగునీటి సమస్య పరిష్కరించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని జెట్టిపాలెం గ్రామంలో జలజీవన్ పథకం కింద రూ.50లక్షలతో నిర్మిస్తున్న ఓవర్‌హెడ్ ట్యాంక్ పనులకు ఆయన భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెన్ను వెంకటేశ్, మున్నా ప్రభురాజు, నీలం మల్లయ్య, వెంకటరామిరెడ్డి, నర్సింహారావు, సతీష్, పున్నారావు, హనిరెడ్డి, బాలయ్య పాల్గొన్నారు.

నారసింహుని సన్నిధిలో పోలీస్ అధికారులు

కారెంపూడి: ప్రసిద్ధ సింగరుట్ల శ్రీ లక్ష్మీ నారసింహ స్వామిని కారెంపూడి సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ వాసు శనివారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు మారేపల్లి వేంకట రమణాచార్యుల చేతుల మీదగా స్వామికి ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ ఈఓ శివనాగిరెడ్డి అధికారులను సన్మానించి స్వామి ప్రసాదాలు అందజేశారు. అనంతరం ప్రతి శనివారం స్వామి సన్నిధిలో జరిగే అన్నదాన కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు. నల్లమల అడవిలో ప్రశాంత వాతావరణంలో స్వయంభుగా కొలువైన స్వామి చెంత జరిగిన అన్నదానంలో పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు చేసుకోండి

నూజెండ్ల: నియోజకవర్గ సెక్టార్ పరిధిలోని వినుకొండ రూరల్, నూజెండ్ల, శావల్యాపురం మండలాల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకురాలు పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో కె.వాణి తెలిపారు. వినుకొండ మండలం నాగులవరం, నూజెండ్ల మండలం జె.సి.నగర్ సెంటర్‌లకు కార్యకర్త పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వీటిని వరుసగా ఎస్సీ, ఎస్టీకి కేటాయించటం జరిగిందన్నారు. సహాయకురాలు ఖాళీలు వినుకొండ మండలం వెంకుపాలెం-2 (జనరల్), హసన్నాయుడు పాలెం (జనరల్), పిట్టంబండ-1 (బీసీ.బి), పిట్టంబండ-3 (ఎస్సీ), పానకాలపాలెం (జనరల్), నర్సనాయునిపాలెం (జనరల్), వెంకుపాలెం-1 (ఎస్సీ), శావల్యాపురం -4 (ఎస్టీ), కొత్తలూరు-1 (జనరల్), నూజెండ్ల మండలం లో కొత్తరెడ్డిపాలెం (జనరల్), జడ్డావారిపాలెం (జనరల్), రెడ్డికొత్తూరు (జనరల్) ఉండగా రిజర్వేషన్ల ప్రకారం భర్తీ చేయటం జరుగుతుందన్నారు. దరఖాస్తు చేసుకునే వారు స్థానిక మహిళ అయి, 35 సంవత్సరాలు నిండి ఉండాలన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని పూర్తి చేసిన దరఖాస్తులు ఈ నెల 20వ తేదీ లోపు వినుకొండ ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలని సీడీపీవో తెలిపారు.

బైక్ చోరీపై ఫిర్యాదు

నరసరావుపేట టౌన్: ద్విచక్ర వాహనం అపహరణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ ఎం.వి. చరణ్ శనివారం తెలిపారు. ఇస్లాంపేటకు చెందిన పఠాన్ హుస్సేన్ షరీఫ్ తన ద్విచక్ర వాహనాన్ని శుక్రవారం ఆర్టీసీ బస్టాండ్ వెనుక సతీష్ రోడ్డులోని ఓ ఫాస్ట్ ఫుడ్ సెంటర్ ఎదుట ద్విచక్ర వాహనాన్ని నిలిపాడు. కొద్దిసేపటి తర్వాత వాహనం కనిపించ లేదు. చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం దక్కలేదు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ప్రభుత్వ తీరుపై సచివాలయ ఉద్యోగుల నిరసన

నాదెండ్ల: వలంటీర్ల పనులను సచివాలయ సిబ్బందితో బలవంతంగా చేయిస్తూ ఆత్మగౌరవానికి భంగం కలిగిస్తున్న ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఏపీ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ సభ్యులు శనివారం డిప్యూటీ ఎంపీడీవో తోకల వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సమస్యలు తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 5వ తేదీన అధికారికంగా సామాజిక మాధ్యమాల ద్వారా ప్రభుత్వానికి సమస్యలు విన్నవించామన్నారు. రాష్ట్ర పరిపాలనలో ప్రాణవాయువు లాంటి సచివాలయ ఉద్యోగుల శక్తిని నిర్వీర్యం చేసేలా ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వలంటీర్లు ఒక క్లస్టర్‌కు పరిమితమై నిర్వహించిన విధులను సచివాలయ ఉద్యోగులకు ఒకటి కంటే ఎక్కువ క్లస్టర్లు కేటాయించి అధిక పనిభారం మోపుతున్నారని వాపోయారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు.



నాదెండ్లలో డెప్యూటీ ఎంపీడీఓ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు

ఇరువర్గాలపై కేసు నమోదు

యడ్లపాడు: తిమ్మాపురం గ్రామంలో ఓ వ్యక్తి అంత్యక్రియల సమయంలో ఇరు కుటుంబాల మధ్య వివాదం చెలరేగి ఘర్షణకు దారితీసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన బిరుదు బెన్ని (26) ఈ నెల 4న మృతి చెందారు. ఇదేగ్రామానికి చెందిన బిరుదు అంజయ్య (50) ఐదో తేదీన మృతి చెందారు. ఇరువురిని అంత్యక్రియలకు తరలిస్తున్న సమయంలో తిమ్మాపురం కొత్త బైపాస్ అండర్‌పాస్ వద్ద ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో కత్తులు, కర్రలతో ఒకరిపై ఒకరు దాడి చేసుకోవటంతో పలువురు గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ తల్‌సైనిక్ శిబిరానికి ఎన్‌సీసీ క్యాడెట్స్

నరసరావుపేట రూరల్: జాతీయస్థాయి తల్‌సైనిక్ శిబిరానికి నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఇద్దరు ఎన్‌సీసీ క్యాడెట్స్ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. కళాశాలలో చెందిన జూనియర్ అండర్ ఆఫీసర్ చిన్నం మణికుమార్, పి.లిఖిత నందినిలు ఆల్ ఇండియా తల్ సైనిక్ క్యాంప్‌కు ఎంపికైనట్లు వివరించారు. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 12 వరకు న్యూఢిల్లీలో జరిగే సైనిక్ శిబిరంలో అబ్స్టాకిల్ కోర్స్, ఇంటర్ డైరక్టరేట్ షూటింగ్ పోటీల్లో ఏపీ, తెలంగాణ డైరెక్టరేట్ తరపున వీరు ప్రతినిధులుగా పాల్గొంటారని పేర్కొన్నారు. తల్‌సైనిక్ శిబిరానికి ఎంపికైన క్యాడెట్స్‌ను కళాశాల చైర్మన్ మిట్టపల్లి కోటేశ్వరరావు, వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్ర వర్తి, 23వ ఆంధ్రప్రదేశ్ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ గోపాల్ త్రిపాటి, కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ మేడికొండ రాజేష్‌బాబులు అభినందించారు.





చిన్నం మణికుమార్ లిఖిత

పనిప్రదేశాల్లో మహిళలకు రక్షణ కల్పించాలి

నాదెండ్ల: పనిప్రదేశాల్లో మహిళలు వేధింపులకు గురికాకుండా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని నాదెండ్ల సీడీపీవో శాంతకుమారి చెప్పారు. గణపవరంలోని వైఎస్సార్ స్పిన్నింగ్ మిల్లులో మిషన్ శక్తి సంకల్ప్-ఉమెన్స్ సేఫ్టీ ఎట్ వర్క్‌ప్లేస్ అనే అంశంపై కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ నెల 12 వరకూ ప్రతి పరిశ్రమలో కార్మికులకు అవగాహన కల్పిస్తామన్నారు. వరకట్నం, మైనర్ల వివాహాలు జరిగినట్లయితే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. పనిప్రాంతాల్లో మహిళలు ఎలాంటి వేధింపులకు గురైనా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

పేద విద్యార్థులకు ఉల్లాస్ చేయూత



ఆర్థికసాయం అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

నాదెండ్ల: గ్రామీణ ప్రాంతాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న పేద కుటుంబాలకు చెందిన పది మంది విద్యార్థులకు ఉల్లాస్ స్వచ్ఛంద సంస్థ చేయూతనందించింది. శనివారం గణపవరం కెల్లంపల్లి భద్రాచలం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 9,10 తరగతులు చదువుతున్న మెరిట్ విద్యార్థులు పది మందిని ఎంపిక చేసి ఒక్కొక్కరికీ రూ.వెయ్యి ఆర్థిక సాయంగా అందించినట్లు హెచ్‌ఎం ఐ.కృష్ణానాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ళ నుంచి పోలారిస్ సంస్థలో పనిచేస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు వారి జీతభత్యాల నుంచి కొంత నగదును పేద విద్యార్థులకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మెరిట్‌లో ఉన్న విద్యార్థులను ప్రోత్సహించేందుకు రాష్ట్రంలోని ప్రతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను ఎంపికచేసి ఆర్థికసాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఉల్లాస్‌సంస్థ సూపర్‌వైజర్ పెద్ది సుజాత, ఎన్‌సీసీ అధికారి రసూల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

నరసరావుపేట రూరల్: ఎరువుల కృతిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు తెలిపారు. నరసరావుపేట మండలంలోని జొన్నలగడ్డ పీఏసీఎస్‌ను శనివారం జగ్గారావు సందర్శించారు. పీఏసీఎస్ గొడన్‌లోని స్టాక్ వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులు అమ్మిన వెంటనే ఇంటిగ్రేటెడ్ ఫర్టిలైజర్ మేనేజ్మెంట్ సిస్టంలో ఎరువులు అమ్మిన వివరాలను యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు. రైతులకు ఎంఆర్‌పీ ధర కంటే అధికంగా అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు కె.వి. శ్రీనివాసరావు, వ్యవసాయ విస్తరణ అధికారి గోపిరెడ్డిలు పాల్గొన్నారు.

స్టడీ టేబుల్ వితరణ

ఈపూరు (శావల్యాపురం): మండలంలోని కొచ్చర్ల ఉప్పరపాలెంలో యంగ్ స్టార్స్ హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ సారథ్యంలో అంగన్‌వాడీ సెంటరుకు స్టడీ టేబుల్ లంచ్ బాక్సులు వితరణ చేసినట్లు అనిల్‌రాజ్ శనివారం తెలిపారు. మాజీ సర్పంచ్ చికూరాకుల శ్రీదేవి పాల్గొన్నారు.

వీఆర్వోలపై టీడీపీ కార్యకర్తలు గరంగరం

సాక్షి టాస్క్ ఫోర్స్: కూటమి ప్రభుత్వంలో ఆ పార్టీ నేతలకే వీఆర్వోలు పనిచేయకపోవడంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడం ఇప్పుడు సంచలనంగా మారింది. మండలంలో వీఆర్వోల పనితీరుపై గురజాల ఆర్డీఓకు ఇటీవల ఫిర్యాదు చేశారు. నెలల తరబడి పనులు చేయకుండా ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని ఆ ఫిర్యాదులో టీడీపీ నాయకులు పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతలకు నో ఎంట్రీ..

దాచేపల్లి మండలంలో భూ సమస్యలపై వీఆర్వోల దగ్గరకు వైఎస్సార్ సీపీ కార్యకర్తలు వస్తే మీ పనులు మేము చేయం.. ఏదైనా ఉంటే టీడీపీ నాయకులతో మాకు చెప్పించండి అంటూ ఉచిత సలహాలు ఇస్తున్నారు. వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు భూములు అమ్మకాలు కొనుగోలు జరిపితే ఆన్‌లైన్‌లో పేర్ల మార్పులు- చేర్పులకు కూడా వీఆర్వోలు సహకరించిన పరిస్థితి. కనీసం కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలకు కూడా ఇచ్చేందుకు వీఆర్వోలు ఇబ్బందులు పెడుతున్నారు.



వీఆర్ఓ పనితీరుపై గురజాల ఆర్డీఓ మురళీకృష్ణకు ఫిర్యాదు చేస్తున్న దాచేపల్లి టీడీపీ నేతలు

> **వీఆర్వోల పనితీరు మెరుగుపరుస్తున్నాం**
> వీఆర్వోలు పనిచేయకపోతే నేరుగా నా దృష్టి తీసుకు వస్తే సంబంధిత వీఆర్ఓపై చర్యలు తీసుకుంటాం. వీఆర్ఓ పనితీరుపై గురజాల ఆర్డీఓకి ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ చేస్తున్నాం.
> – జి.శ్రీనివాస్ యాదవ్, తహసీల్దార్, దాచేపల్లి

సమాజంలో ఉపాధ్యాయ వృత్తి గొప్పది

మాచర్ల: చదువు జీవితానికి గొప్ప సంస్కారం సభ్యత గౌరవం కల్పిస్తాయి అని మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్ సాహెబ్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా చక్రధర్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. విజ్ఞానం మనిషికి మూడవ నేత్రం లాంటిదన్నారు. చదువుకున్న వారు చదువుని అందరికీ పంచి అందరిలో మార్పు తీసుకొని రావాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ డి.వేణు బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు ఆదర్శ ఉపాధ్యాయులుగా ఎదగాలని ఆకాంక్షించారు. యూనివర్సిటీ ప్రొఫెసర్ షేక్ అప్జల్ మాట్లాడుతూ విద్య అందరికీ అందించినప్పుడే నిజమైన ఉపాధ్యాయుడన్నారు. అటువంటి ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నందుకు మనం గర్వపడాలన్నారు. రిటైర్డ్ డెప్యూటీ డీఈఓ రామకృష్ణారావు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో ఒడిదుడుకులు ఉన్నప్పటికి గౌరవప్రదమైందని చెప్పారు. అనంతరం వివిధ ప్రైవేట్ పాఠశాలలకు చెందిన ధూపాటి శ్రీనివాసరావు, ఉదయలక్ష్మి, లక్ష్మి ప్రసన్నకుమారి, పుష్పలత, వర్ధిని కుమారి, అరుణ, షరీఫ్, నిషా, నిర్మల, రాణి , పీర్ సాహెబ్, విజయలత, కిషోర్ , మహమ్మద్ జానీ, కోటేశ్వరావు, అన్ని గ్రేస్, దుర్గాదేవి మణి కుమారి, రాజ్యలక్ష్మి, సీనియర్ లెక్చరర్ కేలం ఆదినారాయణ తదితరులను ఘనంగా సన్మానించి సర్టిఫికెట్లను బహూకరించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్ రెడ్డి, ఓరుగంటి చెన్నకేశవరావు, మేడం నాగేశ్వరావు, అల్లం కోటిరెడ్డి, మాజీ చైర్మన్ బత్తుల ఏడుకొండలు, కళాశాల డైరెక్టర్ మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో మదార్‌సాహెబ్, వేణుబాబు, చక్రధర్, తదితరులు

ఉపాధ్యాయులకు ఘన సన్మానం

మాచర్ల: మాచర్ల నియోజకవర్గ అపుస్మా కార్యవర్గ సభ్యుల ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాచర్ల, వెల్దుర్తి, రెంటచింతల, దుర్గి, కారంపూడి మండలాలకు చెందిన అన్ని ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్స్, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఐదు మండలాలకు చెందిన ప్రతి ప్రైవేటు పాఠశాల నుంచి ఒక్కొక్క సీనియర్ టీచర్‌కు బెస్ట్ టీచర్ అవార్డ్ అందజేశారు. ముఖ్యఅతిథిగా మాచర్ల మండల విద్యాశాఖ అధికారి అల్లి సురేష్ పాల్గొని ఉపాధ్యాయులను సత్కరించారు. మాచర్ల నియోజకవర్గం ప్రెసిడెంట్ వాణి స్కూల్‌కు చెందిన కేవీ రమణ, సెక్రటరీ జనిత్ స్కూల్‌కు చెందిన శ్రీనివాస్, ట్రెజరర్ సరస్వతీ స్కూల్ మండాది శ్రీనివాస రాజు, స్టేట్ జాయింట్ సెక్రటరీ కిడ్స్ పాఠశాల ప్రిన్సిపాల్ జె.వి.ఎస్.రామకృష్ణశాస్త్రి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. 35 మంది టీచర్లను ఈ సందర్భంగా సత్కరించారు. ప్రెసిడెంట్ రమణ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ప్రైవేటు పాఠశాల యాజమాన్యానికి అండగా ఉంటున్నామన్నారు. కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచే విధంగా ర్యాంక్ ఎటైన్మెంట్ కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. స్టేట్ జాయింట్ సెక్రటరీ శాస్త్రి మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు ఇన్సూరెన్స్, భవిష్య నిధి ఏర్పాటు చేసేలా కార్యాచరణ చేపట్టాలని సూచించారు. ఎంఈఓ అల్లి సురేష్ మాట్లాడుతూ విద్య ఆహ్లాదకరంగా, ఉపయోగకరంగా ఉండాలన్నారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికనుగుణంగా ఉపాధ్యాయులు నైపుణ్యాలను పెంచుకోవాలని తెలిపారు.



ఉపాధ్యాయులను సన్మానించిన అపుస్మా కార్యవర్గ సభ్యులు

ఆంగ్లంలో ఆసక్తి పెంచటం అభినందనీయం

చిలకలూరిపేట: విద్యార్థులకు ఆంగ్లం పట్ల ఆసక్తి పెంచేందుకు ఆంగ్ల ఉపాధ్యాయుడు షేక్ మొహమ్మద్ యాసిన్ చేస్తున్న కృషి అభినందనీయమని పసుమర్రు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం వై.హనుమంతరావు చెప్పారు. మండలంలోని పసుమర్రులోని జెడ్పీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థులు ఆంగ్లంలో వందకు 90 మార్కులు పైబడి తెచ్చుకున్న 9 మందికి ఆంగ్ల ఉపాధ్యాయుడు యాసిన్ ఒక్కొక్కరికీ రూ. వెయ్యి చొప్పున ప్రోత్సాహక బహుమతులు శనివారం అందించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి ఏటా పదో తరగతిలో 90 మార్కులు పైబడి తెచ్చుకున్న విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నారని చెప్పారు. ఈ క్రమంలోనే గత ఏడాది 11 మంది విద్యార్థులకు, అంతకు ముందు ఏడాది 21 మంది విద్యార్థులకు నగదు బహుమతులు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు గద్దె హరిబాబు, విశ్రాంత హెచ్‌ఎం బి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

దేవస్థానం అభివృద్ధికి కృషి చేయండి

రెంటచింతల: రాష్ట్రంలోనే అతిపురాతనమైన శైవ క్షేత్రంగా పేరు పొందిన సత్రశాల శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానం అభివృద్ధికి నూతన ట్రస్ట్‌బోర్డు సభ్యులు కృషి చేయాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కోరారు. శనివారం దేవస్థానం ఆవరణలో నూతన ట్రస్ట్‌బోర్డు చైర్మన్ శివయ్య, సభ్యుల ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. త్వరలో జరగనున్న శాసనసభ సమావేశాలు అనంతరం ఆలయ ఇంజినీర్లు, సత్రశాలలో పర్యటించనున్నట్లు చెప్పారు. నూతన ఆలయ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తారని పేర్కొన్నారు. మాచర్ల చెన్నకేశస్వామి, కారెంపూడి వీర్ల దేవాలయం ఆధునికీకరణ పనులకు నిధులు మజూరు చేయడానికి కృషి చేయనున్నట్లు చెప్పారు. అడిగొప్పల అమ్మవారి దేవస్థానం అభివృద్ధికి ఇప్పటికే రూ.405 కోట్లు నిధులు మంజూరు అయినట్లు తెలిపారు. సత్రశాల, నిదానంపాటి అమ్మవారి ఆలయాల వరకు రహదారుల విస్తరణకు కూడా త్వరలోనే నిధులు కేటాయింపుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎండోమెంట్ ఈఓ గాదె రామిరెడ్డి, మున్నా ప్రభురాజు, గొట్టం శ్రీనివాసరెడ్డి, నీలం మల్లయ్య, సిహెచ్.అబ్బిరెడ్డి, గొంటు సుమంత్‌రెడ్డి, బి.రామకృష్ణ పాల్గొన్నారు.



నూతన ట్రస్ట్‌బోర్డు సభ్యుల ప్రమాణ స్వీకారానికి హాజరైన ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి